# ఆనవాలు

చంటిపిల్లాడిని ఎత్తుకొని, మిగతా ఇద్దరు పిల్లలూ వెంట రాగా లక్ష్మి బండి దిగింది.

ఆమె మూడో పురుడు, పుట్టింట్లో పోసుకొని తనింటికి తిరిగి వచ్చింది. ఆమె అకస్మాత్తుగా రావడం చూసి, భర్త ప్రసాద్ ఆశ్చర్యపోయాడు. తన భార్య ఎంతో వేగిరం వచ్చేసినట్టు అతనికి అనిపించింది ఏదో అయిష్టత కనిపించింది అతనిలో ఆమెకి.

''ఉత్తరమయినా వ్రాయకుండా యిలా దిగిపోయావేం?'' అని అడిగాడు. మొట్ట మొదట అడిగిన ప్రశ్న అది.

''వచ్చేస్తూంటే వ్రాసే దేమిటి ? అయినా నాన్నగారితో చెప్పేను మీకు వ్రాయమని. వ్యవధి లేకపోయింది కామోసు!'' అని చెప్పింది.

''తాపీగా బయలు దేరలేక పోయినావా ? అంత ఉక్కిరి బిక్కిరి ఏమొచ్చింది ?''

''ఏమిటో యిప్పటికే మూడు నాలుగు నెలలయింది. ఎన్నాళ్ళని వాళ్ళింట్లో పిల్లలతో సహా తింటూ కూర్చోడం ? వాళ్ళు మాత్రం లక్షాధికారులా ! ప్రతీ మారూ వాళ్ళే భరిస్తూ వస్తున్నారాయె!..... అయినా కాస్త చేసుకోగలిగే బలం వచ్చాక యింకెందుకు అని వచ్చేశాను.... '' అని అంది

అతడడిగిన ఈ ప్రశ్నలు, వైఖరీ చూసి ఆమెకు కొంత ఆశ్చర్యాన్ని కలిగించేయి. భర్త మరింకేమీ ప్రశ్నించలేదు. బట్టలు వేసుకు వెళ్ళిపోయాడు.

ఆడదిలేని కొంప ఎలా వుండాలో అలాగే వుంది. ఎక్కడివక్కడ బూజులు పట్టేసి అంతా అపరిశుభ్రంగా వుంది. తాపీగా ఇల్లు సర్దడం మొదలెట్టింది లక్ష్మి. ప్రపంచంలో ఆడవాళ్లే లేకపోతే పరిశుభ్రం అన్నది మచ్చుకయినా వుండదేమో...... చేసే వాళ్ళుంటే మాత్రం మగవాళ్ళకి శుభ్రత కావాలి.... స్త్రీ దగ్గరుండి చేస్తూంటే అదలా చేశావు. యిదిలా చెయ్యాలి! అని చెప్పగలరు కూడా. కాని స్వయంగా చెయ్యవలసివస్తే మాత్రం తెలుస్తుంది.

గది అంతా గజిబిజిగా., చిందర వందరగా వుంది. ఎక్కడ వుండవలసిన వస్తువు అక్కడలేదు. పందిరి మంచం నిండా ఏవేవో చొక్కాలు, పంచలూ, లుంగీలూ, తువ్వాళ్ళూ, యిలాటివి వేళ్ళాడుతూ.... పాతాళ భైరవిలా వుంది ! బీరువా అద్దాల మీద అంగుళం దళసరి ధూళి పట్టి వుంది. బీరువా నెత్తి మీద న్యూస్ పేపర్లూ, పత్రికలూ, పుస్తకాలు తాటాకుల్లా అసహ్యంగా వున్నాయి. పెట్టెలు నోళ్ళు సగం విప్పి లోనుండి బట్టలని కక్కుతూ వున్నాయి.

గోడకి తగిలించిన పటాలూ, ఒకటో రెండో మేకులూడి అడ్డంగా వేలాడుతూ వికారంగా వున్నాయి. ఒకదానికీ ఒకదానికీ వంతెనల్లా సాలెగూళ్ళు అల్లుకొని పోయాయి. క్రిందని కాలువేస్తే ఆ పాదంతో సహా క్రింద పడిన దుమ్ము అంటుకొని అక్కడొక అచ్చు పడుతూంది! అలా గదినిండా ఎన్నో పాదాల అచ్చులు కనబడుతూ వున్నాయి!

టేబిలుమీద తనువున్నప్పుడు ఫ్లవర్‌వేజ్‌లో పెట్టిన పూలకొమ్మలే వాలి, వాడిపోయి నల్లగా మారిపోయి అసహ్యంగా వున్నాయి. రేజర్ పెట్టె విడివిడిగా టేబిలుమీదే పడేసి వుంది. దువ్వెనల నిండా చీములు పట్టి వున్నాయి. టేబిల్‌క్లాత్ మీద భరిణలో కుంకం కాబోలు ఒలికిపోయింది. యిదంతా చూసి ఎక్కడ నుండి సర్దడం మొదలెట్టాలో ఆమెకి తోచలేదు.... ఇది పడకగది సౌరభ్యం.

ఇక సామాను గది చూస్తే ఒకదాని మీద మూతల్లేవు.... తను జాగ్రత్తగా అన్ని సామానులూ సర్దివెళితే ఎలకలు, నిరాటంకంగా రాజ్యం ఏలినట్టున్నాయి. యాత్రల్లో మనుషుల్లా చీమలు బారులు తీరి ఆహారయాత్ర చేస్తున్నాయి. ఆమె చడి విని ఎలుకలు అందిన మట్టుకు సంగ్రహించి మకాం ఎత్తడానికి జాగ్రత్త పడుతున్నాయి.

ఇదంతా చూసి లక్ష్మి ఆశ్చర్యపోయింది. యిలా పాడయిపోయే కన్నా - పోనీ పనిమనిషి చిన్నమ్మి చేతనయినా ఒకనాడు దగ్గిరుండి తుడిపించే ఓపిక లేకపోయింది కామోసు!'' అని విచారించింది.

పందిరి మంచం మీద వేలాడుతున్న బట్టలన్నింటినీ తీసి సర్దింది. పక్కమీద దుప్పటి తలగడా గలేబులు, ఆ మూడు నెలలనుండీ చాకలి మొహం చూసినట్టు లేవు. నూనె జిడ్డుతో మాసిపోయి వున్నాయి. దుప్పటి ఒక మూలకు ఉమ్మ చుట్టుకు పోయివుంది. ఆ దుప్పటి తీసి దులిపేసరికి ఆ మడతలోంచి సిగరెట్టుపెట్టెలూ, అగ్గిపుల్లలూ, కాస్త చిల్లరడబ్బులూ, రెండు మూడు నోట్లూ జారిపడ్డాయి, వాటితో సహా బరువయిన వస్తువు ఏదో కింద పడి చప్పుడయింది.

ఏమిటా అని ఆ వస్తువుని చూసింది లక్ష్మి. ఆశ్చర్యపోయింది. తన కళ్ళని తనే నమ్మలేకపోయింది. ఒకకాలి వెండి పట్టీ అది! దాన్ని చూసి ఆమె మనసు పరిపరి విధాల పరుగెట్టింది. గుండెల్లో రాయిపడింది! కోపం, ఆశ్చర్యం, ఈర్ష్య, ఉద్రేకం, అన్నీ ఒక్కసారి కలిగేయి. కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

ఆ పట్టీ ఎవరిదో చూడగానే పోల్చేసింది. అది మరెవరిదో కాదు! తన యింట్లో పనిచేసే చిన్నమ్మిదే!... తనింకా ఎంత అమాయకురాలు. పనిమనిషి చేతనయినా తుడిపించ లేకపోయారా! అని అనుకుంది యీ ఇంటిని చూసి, యిప్పుడు తెలిసింది పనిమనిషి ఏం పని చేస్తూందో ? .... తను యింట్లో లేని సమయం చూసి ఎంత నాటకం ఆడుతోంది! ఎంత ధైర్యం ? ఎంత సాహసం ? అయినా దాన్ని అని ఏం లాభం ? యిటు తనభర్త! ఇంకా చిన్నవాడా ? పిల్లల తండ్రి! యింకా ఏమిటీ పాడుబుద్ధి. వయసు మళ్ళిపోతోంది ఇంకా ఏమిటీ కోరిక ?..... ఇంత అన్యాయం చేస్తాడని ఆమె అనుకోలేదు. ఇన్నాళ్ళూ - తన జీవితం నిత్యానంద మయినదని, తన నోముల ఫలం వల్లనే అనుకూలుడయిన భర్త దొరికాడని. తన సంసారం ఒక స్వర్గ సీమ అని అనుకుంది. తన జీవితం యిలా గడిచిపోతే చాలని, చల్లగా చూడమని వేయి దేవుళ్ళకు మొక్కు కుంటోంది! ఇన్నాళ్ళ

ఏ గొడవా లేకుండా జరిగిపోయింది. యింక యిప్పుడా యిలాంటి బాధలు ? నిజంగా తను అనుమానిస్తున్నది నిజమా ? తన భర్త అలాంటి వాడా ? - ఇంకా అనుమానం దేనికి ? లేకపోతే దాని కాలిపట్టీ మంచం మీదకి ఎలా వస్తుంది ? ఇన్నేళ్లు వచ్చి యిప్పుడా అతనికీ స్త్రీ వాంఛ? అతనికి తనేం లోటు చేసింది. యీ మొగవాళ్లు కోరిక తీరిపోతే చాలని చూస్తారు గాని దానివల్ల ఎంత పతనమయిపోతున్నారో ఆలోచించరు కదా. శీలాన్ని అంత చులకనగా తీసుకుంటారు గాని మనిషి విలువ అందులోనే వుందని తెలియదా ?

ఆడది ఏం చేసినా, ఆ రహస్యం దాగకుండా ప్రకృతి శాపం ఇచ్చేస్తుంది ! కాని మగవాడేం చేసినా చెల్లుతుంది. కాని శీలం, నీతి, అన్నది యిద్దరిలోనూ ఒక్కటే. దాని విలువ స్త్రీ పురుషులకి సమానమే! దాన్ని కాపాడుకోలేని జీవితం ఎందుకు ?

ఈ విధంగా ఆమె తలచుకుంటుంటే కోపం ఎక్కువయిపోతూంది. ఆమె యిదివరకెన్నడూ యిటువంటి సంఘటన ఎదుర్కొనలేదు ! యిటువంటి అనుమాన పిశాచం ఆమెను పట్టుకోనూ లేదు. తను అమాయకురాలు. నిర్మలమయినది. భర్తమీద కూడా అటువంటి భావమే కలది. భర్త తనసొత్తు అని భావించింది. ఆ సొత్తుని యింకొకరు పంచుకుంటున్నారంటే, సహించలేదు... చిన్నమ్మ గాని ఆ సమయంలో అక్కడ వుంటే చంపేయాలన్నంత కోపం ఆమెలో కలిగింది ! తన పచ్చని సంసారంలో చిచ్చుపడినట్టు ఆమె కళ్ళకు కనిపించింది. తన యిల్లు కూలిపోతున్నట్లు భావించింది. అలా ఎన్నటికీ కాకూడదు. కాకుండా ఆమె ఎదుర్కోవాలి ! ఏ అనర్థానికయినా సిద్ధపడాలి ! ఇంక యిటువంటి పాపపు పని తన యింట్లో ఎన్నటికీ జరగడానికి వీల్లేదు. జరిగితే సహించి వూరుకోకూడదు!

ఈ సంగతేమిటో పరిస్థితులు ముదిరి విషమించకముందే చక్కబరచుకోవాలి ! తన భర్తని అడిగి తెల్సుకోవాలి ! అని లక్ష్మి నిశ్చయించుకుంది. నిరుత్సాహంతో ఇల్లంతా ఏదోలా సర్దింది. భర్త వస్తే అడుగుదామని ఎదురు చూస్తోంది.

ఆమె భర్త రానే వచ్చాడు అనుమానంతో చూస్తున్న ఆమెకంటికి అతనేదో తప్పు చేసి సిగ్గుపడుతున్న వాడిలాగే కనిపించసాగేడు.

అతణ్ణి చూస్తున్నకొద్దీ, ఆ సంగతేదో తేల్చుకుందామన్న తొందర లావయింది. పిల్లలందరూ అవతలకి ఆడుకుందికి పోనిచ్చి -

''ఏమండీ ఇది చూశారా ?'' అని మెల్లగా ఆ వెండి పట్టీ చూపెడుతూ అడిగింది.

అతను దానివయిపు చూసి గతుక్కుమన్నాడు కాని.

''అవును ఎవరిదా పట్టీ'' ఏమీ ఎరగనట్టు అడిగాడు.

''ఎవరిదీ ? అనే నేనూ అడుగుతున్నాను !'' అని నిలదీసింది లక్ష్మి. ఏదో కొంప మునిగింది అని ప్రసాద్ అనుకున్నాడు.

''ఏమో నాకేం తెలుసు నన్నడుగుతున్నావేం ?'' అనేశాడు ధైర్యంగా.

''ఈ పట్టీ మనింట్లోకి ఎలా వచ్చిందా ? అని అడుగుతున్నాను''

''మనింట్లోకా !'' ఆశ్చర్యం ప్రకటించాడు.

''ఆ మనింట్లోకే.... మన పందిరి మంచం మీద దొరికింది ! ...పాపం.... ఎవర్తో కాలి పట్టీ జారిపోయిందన్న మాటకూడా మరిచిపోయి వెళ్లిపోయింది. లేక ఆమె లేనప్పుడు జ్ఞాపకార్థంగా వుంచుకున్నారా ?'' అని ఖచ్చితంగా అనేసింది లక్ష్మి.

''ఏమిటి ? ఏమిటి ? లక్ష్మి ఆ మాటలు ! .... ఆ పట్టీ సంగతి నాకేమీ తెలీదు ! '' అని బుకాయించేడు ప్రసాద్.

''మీకు తెలియకపోతే మరెవరికి తెలుస్తుంది ? ఎందుకు నా దగ్గర అబద్ధాలు ఆడుతారు. ! అంతగా మీకు ఇష్టం లేకపోతే చెప్పరాదూ ? మీ కంటికి నేనంత కంటకప్రాయంగా వుంటే అక్కడే వుండిపోదును! ఇన్నేళ్లు .... వచ్చి.... యిప్పుడింత అన్యాయం చేస్తారని అనుకోలేదు.... నన్నిలా ఏడిపిస్తారని అనుకోలేదు!.....'' అని ఏడుస్తూ కూర్చుంది.

''ఇప్పుడేం వచ్చింది. లక్ష్మి అలా మొదలెట్టేవు ! అనవసరంగా అనుమానపడి నానా మాటలలా అంటున్నావంతే !''

''అనుమానం ఏమిటండీ ? ప్రత్యక్షంగా కనబడుతున్నదానికి ! పోనీ చెప్పండి ! మన యింట్లో లేని వెండి పట్టీ ఎలా మనింట్లోకి వచ్చింది ? అందులో మంచం మీద ఎలా జారిపడింది ? ఎవర్తిది అది ? నా కాపురం పాడు చేయడానికి వచ్చినదెవర్తో చెప్పండి ?'' అని కోపంతో అంది.

''ఎవర్తదో నాకు తెలీదు''

''నాకు తెలుసు, మీరు చెప్పనక్కర్లేదు. చూస్తే అంతా బోధపడుతూనే వుంది.... అన్న ? .... ఎంత అప్రతిష్ఠ ! ఏవండీ ? యిప్పుడా మీకీ బుద్ధి ! చిన్న పిల్లలా చెప్పడానికి ? యిలా నానా వెధవలనీ యింటికి తీసుకువచ్చి.... ఇదేం పని కొంపా ? ఎంత అమర్యాద ! ఎంత నవ్వులాట ? ఎవరికయినా తెలిస్తే ఏమంటారు ?'' అని చెప్పబోయింది.

''నోర్ముయ్ ఇంక వాగక.... నా యిష్టం ! '' అని అరిచాడు ప్రసాద్.

''ఎందుకు మూయాలి ? మీ యిష్టం వచ్చినట్టు ఆడుతూంటే నా బ్రతుకేం కావాలి ? అయ్యో! ఆరుగురు పిల్లలు వారి ముఖమన్నా చూడండి, యీ వయసులో యింకా మీకీ వ్యసనం ఏమిటి ?''

''నేను మడి కట్టుకు కూర్చోలేను! '' అని విచిత్రంగా అన్నాడు.

''అయ్యయ్యో ! ఎటువంటి మాట లంటున్నారండి యివాళ ! పెళ్ళాం పురిటికి వెళితే ఆ మాత్రం ఓర్చుకోలేరా ? అందరూ యిలాగే వుంటున్నారా ? యింక నీతి, జాతి ఏముంది ?... మరి ఆడవాళ్ళందరూ ఎలా వుంటున్నారు ?''

''అది మీ ఆడవాళ్ళ కర్మ''

''అలా అయితే మీరు తిరిగినట్టే నేనుకూడా తిరిగితే వూరుకుంటారా ?'' అని ఉద్రేకంతో లక్ష్మి అనగానే.

''నోర్ముయ్ ! ఏమన్నావు ?'' అని ఒక లెంపకాయ కొట్టేడు ప్రసాద్. లక్ష్మి ఏడవలేదు. ఆమెకు పౌరుషం మరీ లావయింది. అంత దెబ్బకీ తమాయించుకుంది.

''అవును మీరు మగ వాళ్ళు కాబట్టి ఏమయినా చేయగలరు! అంత కోపం ఎందుకండి? ఆ విషయంలో మీకెలాటి అభిప్రాయం వుందో మీమీద నాకలాగే వుండదా? మీ కొరకు నేను ఏమయినా అయిపోవాలి! నా మీద అధికారం హక్కూ అంతా మీదే కావాలి! కాని నేను చెప్పినట్టు మీరు వినకూడదు? మీమీద ఏ విషయంలోనూ నాకు కొంచెం కూడా అధికారం, వుండకూడదు? మీమీద నాకే హక్కూ లేదు! మీరే అన్యాయం చేసినా ఏమనడానికి వీలులేదు!

నేను పరపురుషులను తలచుకుంటే మీకు కోపం వచ్చిందే; అలాంటిది మీరు నా కళ్ళెదుటే - మరొక ఆడదానితో ఉంటూ వుంటే నాకెలా వుంటుంది?..... పోనీండి... అయిందేదో అయిపోయింది. ఇకనయినా అలాంటి పనులు చేయకండి. నా మాట వినండి... మీకాళ్ళు పట్టుకుంటాను. నన్నూ నా పిల్లలను అన్యాయం చేయకండి!'' అని లక్ష్మి ఏడుస్తూ బ్రతిమాలింది.

''లక్ష్మీ! ఇదిగో చెప్తున్నాను నీకిష్టముందా ఈ ఇంట్లో మరే గొడవా చేయకుండా ఉండు. నాకు అడ్డురావద్దు. అనవసరంగా చికాకులు పడకు.... లేకపోతే...'' అని ఖచ్చితంగా అన్నాడు ప్రసాద్.

''లేకపోతే పొమ్మంటారు అంతేనా?'' అని పూర్తి చేసింది.

''అవును'' అని నిశ్చితంగా చెప్పేశాడు.

''ఎక్కడికి పొమ్మంటారు? ఎక్కడికి పోతాను? మా వాళ్లు ఏనాడో మీ చేతుల్లో పెట్టారు. ఇక వాళ్ళ దగ్గరకి నేనెందుకు వెళతాను? నాయిల్లు నేను వదలి ఎందుకు వెళ్ళాలి?''

''భర్త మీద ఉసూరుమనే భార్య ఎందుకు? నువ్వు నా క్షేమం కోరనపుడు యిక్కడెందుకు?''

''ఎంత మాట అన్నారు? బ్రతికినా చచ్చినా ఇదే నా ఇల్లు. మీరే నా దైవం. కాని నాకొక్కమాట ఇవ్వండి. మీరెప్పుడూ ఇలాంటి పనులు చేయనని చెప్పండి. నా మీద ఒట్టు! అలా అనే వరకూ మీ పాదాలు వదలను'' అని లక్ష్మి అతని కాళ్ళు పట్టుకుంది.

ఆమె ఏడుపూ, గొడవా చూచి, ప్రసాద్ ఏమనుకున్నాడో ఏమో, ''సరేలే ఇంక చికాకు పెట్టక వదులు'' అని కోపంతో గుమ్మం దిగి వెళ్ళిపోతున్నాడు.

''భోజనం చేసి వెళ్ళండి'' అని బెక్కుతూ అంది లక్ష్మి.

''చాలు కడుపు నిండిపోయింది'' అని కోపంతో వెళ్ళి పోయేడు ప్రసాద్.

ఆ పూట ఆమె కూడా అభోజనంగా పడుకుంది. ప్రసాద్ రానేలేదు. పిల్లలకి మాత్రం ఇంత పెట్టి, ఇంటిగొడవ వాళ్ళకి తెలియకుండా ఆటలకి పంపి, విచారంతో దుఃఖించసాగింది. ఎలాగయినా అతని దురలవాట్లు మాన్పించాలని నిశ్చయించుకుంది.

తను లేకపోబట్టి ఏదో మనసు చలించి ఒకసారి తప్పు చేసి వుండాలి! అంతేగాని, తను దగ్గర వున్నట్లయితే అతని మనసు మార్చడం అంత పెద్ద కష్టమయిన పని కాదని సమాధాన పరచుకుంది.

కోపంతో వెళ్ళిన భర్త తిరిగి వస్తాడో, రాడో అని బెంగతో క్రుంగిపోతూంది లక్ష్మి. ఆ సమయంలో పెరటి తలుపు చప్పుడయింది. వెళ్ళి తీసింది - పనిమనిషి చిన్నమ్మి గుమ్మంలో అప్సరసలా తయారయి నుంచొని, అనుకోకుండా తలుపు తీసిన లక్ష్మిని చూసి గతుక్కుమనిపోయింది. ఆశ్చర్యం ఏం కనబడనీయకుండా సంభాళించుకుని, నవ్వు తెచ్చుకుని, ''ఏమండీ అమ్మగారూ! ఎప్పుడొచ్చేశారు?

కబురేనా చేసుండా'' అని పలకరించింది.

లక్ష్మి అప్పటికేం మాట్లాడలేదు. చిన్నమ్మిని లోపలికి రానిచ్చింది. - ఆమె దృష్టి మొట్టమొదట, చిన్నమ్మి కాళ్ళ మీదకేపోయింది. ఆశ్చర్యపోలేదుగానీ, అనుమానం ధృఢపరచుకొంది.

అది గ్రహించలేని చిన్నమ్మి మామూలుగానే పనులు చేసుకున్నట్లు చేసుకుపోతూంది లక్ష్మి ముభావం చిన్నమ్మికి కొంచెం వింత కలిగించకపోలేదు. కాని, కారణం బోధపడలేదు. ఎంతయినా తను పనిమనిషి కదా ! అంచేత మామూలుగానే కుశల ప్రశ్నలు వేసింది. చంటిపిల్లని ఎత్తుకు ముద్దులాడింది. అన్నీ నవ్వుతూనే సరదాగానే ఎప్పట్లాగనే చేసుకుపోతూంది. ఎడంకాలు బోడిగా కనబడితే లక్ష్మి ఎక్కడ అడుగుతుందో అని చీర కుచ్చిళ్ళు పాదాల మీదికి గడీగడీకి సర్దుకుంటూంది. లక్ష్మి ఒక కంట కనిపెడుతూనే వుంది

ఊహించి అనుకొని వచ్చిన దొకటి, వచ్చేక పరిస్థితి ఒకటీ అవడం వల్ల చిన్నమ్మి తబ్బిబ్బు పడక తప్పలేదు. ఇంతకు పూర్వం లక్ష్మి ఇంట్లో వుండగా తను వచ్చినప్పటి వేషం , ఇప్పుడు వచ్చిన వేషం - ఈ భేదమే అనుమానం పడడడానికి కారణమయింది....

ఎప్పుడూ పనులన్నీ అయినాక ఇల్లు తుడవడం అలవాటు. అలాటిది ఇవాళ రాగానే చిన్నమ్మి తుడవడమే మొదలెట్టింది. ఎందుకో ఆమెకే తెలుసు. లక్ష్మి ఆ సంగతి ముందే గ్రహించి ఊరుకుంది.

ఇల్లంతా తుడిచి గది తుడిచే చిన్నమ్మి మొదటే గదిలోకి వెళ్ళడం ముందే తెలిసిన లక్ష్మి అనుమానాన్ని బలపరిచింది.

చిన్నమ్మి గది తుడుస్తున్నట్టే తుడుస్తూ, పందిరి మంచంవైపు వెళ్ళి చూసింది. ప్రక్క శుభ్రంగా పరచి ఉండడం చూసి, గుండె దడదడా కొట్టుకుంది. అయినా ఆశ కొద్దీ పక్కమీద, పరుపు క్రిందా గబగబా వెతకనారంభించింది.

లక్ష్మి ఎక్కడ వచ్చేస్తుందో అన్న భయంతో గాభరా పడుతూ.

''అక్కడ లేదే చిన్నమ్మీ! ఇదిగో నేను తీసి దాచానులే! ఇంద తీసుకో !'' అని వెనకనే నిలబడిన లక్ష్మి అంది, ఆ వెండి పట్టీ చేత్తో పట్టుకుని.

వెనక్కి తిరిగి చూసి, చిన్నమ్మి నీరయిపోయి అలాగే నిలబడిపోయింది. గడగడలాడిపోయింది.

''ఊఁ ఇంద తీసుకో ! '' అని తిరిగి అంది లక్ష్మి.

చిన్నమ్మి తెప్పరిల్లి ని...న్న...నిన్న.... తడుస్తున్నప్పుడు - జారి వుంటుందండీ - ఇంటికెళ్ళి చూసుకుంటే లేదు. మనిల్లే కదా ఇవాళ వచ్చి తీసుకోవచ్చు అని - మరి రాలేదు '' అని ఆపట్టీ అందుకుంటూ అంది.

''తుడుస్తున్నప్పుడు - కింద పడుతుంది - మరి పక్కమీద ఎందుకు వెదుకుతున్నావు ?'' అని ప్రశ్నించింది లక్ష్మి. ఆ ప్రశ్నతో చిన్నమ్మి దెబ్బతిన్నట్టయింది. ఏం జవాబు చెప్పలేక అలా నిలుచుండిపోయింది.

''ఏం మాట్లాడవు ?'' అని గట్టిగా గద్దిస్తూ అడిగింది లక్ష్మి. చిన్నమ్మి భుజాలు పట్టుకుని ఊపింది కోపంతో.

చిన్నమ్మి ఏడుస్తూ లక్ష్మి కాళ్లు పట్టుకుంది. క్షమించమనీ, తన తప్పేమీ లేదని, అతనే తనని బలవంతం చేసాడనీ, డబ్బు కక్కుర్తికి తను లొంగిపోయిందనీ మరెప్పుడూ అలా చేయననీ వేడుకుంది.

''అందితే జుట్టూ, అందకపోతే కాళ్ళూ పట్టుకుంటావా ? ఛీ ! నీకు సిగ్గులేదూ ? - నీ మొగుడిని మోసం చేసి మరో మగవాడితో కులకడానికి నీ మనస్సెలా ఒప్పింది ? ఆడవాళ్ళ పరువు నీలాటి వాళ్ళ వల్లేపోతూంది. తిన్న యింటి వాసాలే లెక్కబెడలావా ? నా సంసారంలో నిప్పు చల్లుతావా ? నీలాటిదాన్ని చేరదీయడం నాదే తప్పు, పో ! ఇంక నీ మొహం చూపెట్టకు. మరి నువ్వు నా ఇంట్లో పనికి రానక్కరలేదు. ఇంక వెళ్ళిపో. మళ్ళీ ఇలాటి పని చేయకు !'' అని చెడామడా చీవాట్లు పెట్టింది.

''క్షమించండమ్మా ! మరెన్నడూ ఇలా చేయనమ్మా ! నన్ను మానిపించేయకండి....'' అని చిన్నమ్మ బ్రతిమాలుకుంది గాని లక్ష్మికి ఆమె నుంచడం మరి యిష్టం లేక, ఆమె చేతిలో ఒక పాతిక రూపాయలు పెట్టి మరి యింటి వయిపు రావద్దని, తన భర్తకి కనబడ వద్దని చెప్పి పంపించి వేసింది. అప్పటికి కొంత భారం తగ్గినట్టయింది లక్ష్మికి.

తర్వాత కొన్నాళ్ళ వరకూ ప్రశాంతంగా గడిచింది. అనుమానంతో కూడిన ఆమె మనసు మాత్రం అతని ప్రవర్తనని ఒక కంట కనిపెడుతూనే వుంది. ఇంతకు పూర్వం వినని ఎన్నో విషయాలు ఆ నోటా యీ నోటా ఆమె భర్తపై వింటూంది. కాని ఏం చేయగలదు? అతనంత చెడు వర్తనుడని ఎరుగదు. అసలు యిన్నాళ్లు తెలియకండా యిలాటి విషయాలు రహస్యంగా ఎలా దాగి వున్నాయా? అని. ఇందులో విశేషం ఏముంది ? తను అమాయకురాలు, ఇంతకు ముదు ఎప్పుడూ తన భర్తపై అలాటి దురాలోచనలు రాలేదు. అతనూ తనలాటి అమాయకుడే, పవిత్రుడే, అని అనుకుంది. ఎప్పుడయినా అనుమానించి వుంటే అతని రహస్య ప్రవర్తన తెలిసే వుండేదేమో ? యీనాటికది దానంతటదే బయట పడింది.

తన కళ్ళ ముందటే భర్త యిలా ప్రవర్తించడం లక్ష్మికి తల తీసుకున్నట్టుగా వుంది ! అది ఎంత అవమానం ? స్త్రీకి అంతకన్నా హీనత వుంటుందా ? తన సంసారానికి గొప్ప ఆపదేదో వస్తున్నట్టు భయపడ సాగింది లక్ష్మి. ఏదో మొండి ధైర్యంతో తన భర్తని మంచి దారిలోకి మళ్ళించలేనా ? అనే నమ్మకంతో భగవంతుని నమ్ముకొని గడుపుతూంది.

లోకంలో మరొక రకం మనుషులు కూడా వున్నారు - తమ ప్రత్యక్షంలోనే భర్త ఏ రీతిగా ప్రవర్తించినా, అహం, వ్యక్తిత్వం చంపుకొని, ఎన్ని బాధలయినా భరించి తనను కాదన్నట్టు కుక్కలా పడి వుంటారు. కాని ఆ సహనం, ఆ ఓర్పు, తనకి లేదు. ఏదో విధంగా ఎదుర్కొని, అటో యిటో తేల్చుకోడమే లక్ష్మి ఉద్దేశ్యం. తన హక్కులో భాగం మరొకరు పంచుకోడం ఎంత మాత్రమూ ఆమె సహించలేదు. ఆ మనోనిబ్బరంతో ధైర్యంగానే వుంది.

ఆనాడు పేరంటానికి వెళ్ళి లక్ష్మి తిరిగి వచ్చేసరికి రాత్రి ఏడు ఏడున్నర అయిపోయింది. వచ్చేసరకి ఆలస్యం అవుతుందని, తెలిసే మధ్యాహ్నమే వండేసి మరీ బయలు దేరి వెళ్లింది.

పిల్లలు కాస్త దూరంగా తలిమ్మా పిల్లలతో సహా కలిసి వస్తూండగానే, దీపం ముందుగా

వెలిగిద్దామని తొందరగా వచ్చింది, లక్ష్మి యింటికి. యింట్లో దీపం వెలుగుతూండడం చూసి ఆయన యింట్లోనే వున్నారని గ్రహించింది.

వీధి తలుపు తీసే వుంది. ఆమె ఆశ్చర్య పోతూనే వెళ్లి గది తలుపు తోసింది. ఆ తలుపులు తీసే వున్నయేమో బార్లా తెరుచుకున్నాయి.

ఎదురుగుండా కనబడిన దృశ్యం చూసి ఆమె అలా కొయ్య బారి పోయి వుండి పోయింది. యీమెను చూసి మంచం మీద నుండి, ప్రసాద్ ముందూ ఆ వెనుక చిన్నమ్మా కంగారుగా క్రిందకి దిగేరు.... చిన్నమ్మ చల్లగా అవతలికి జారుకుంది! ప్రసాద్ లక్ష్మి వచ్చినందుకు కోపంతో కళ్లంట నిప్పులు కక్కుతూ గబగబా వచ్చి ఆమెను కొట్టేడు.

''నీకు బుద్ధి వుందా లేదా, ఎందుకొచ్చేవు దెయ్యంలా ? పో యిక్కడ నుంచి పో!!'' అని అమానుషంగా అరిచాడు. యీ మాటలు వినకముందే లక్ష్మి అతను కొట్టిన దెబ్బలకి సొమ్మసిల్లి పడిపోయింది.

ప్రసాద్ యీ లోకంలో పడ్డాడు. ఆమె క్రింద పడేటప్పటికి. కొంచం భయంతో యిన్ని నీళ్లు ఆమె ముఖం మీద చల్లాడు.

ఆమె తెలివి తెచ్చుకుని.... ''మీరా ....'' అని అంటూ రెండు చేతులూ పట్టుగొని ...''ఏమండీ, ఎందుకిలా నన్ను చంపుతున్నారు. మొన్నటితో మళ్లీ అలా చేయరని అనుకున్నాను. మళ్లీ యిదేమిటి చెప్పండి.... యింతేనా ? ...... యికమారరా ?.... చెప్పండి ?'' అని అడిగింది.

అతను ఏం మాటాడకుండా చేతులు వెనక్కు లాగుకొని ముఖం అవతలకి త్రిప్పుకొని దూరంగా వెళ్ళిపోయేడు. , లక్ష్మి తనంతట తానే నిలదొక్కుకుని లేచి కూర్చుంది. ఇంతలో పిల్లలు ''అమ్మా! ఆకలే!'' అంటూ గోల చేస్తూ వచ్చేరు : వారిని వెంట తీసుకుని లోపలికి నీరసంగా వెళ్లిపోయింది.

పిల్లలకి అన్నం పెట్టింది. వారు తింటూండగా భర్త భోజనానికి వస్తాడేమో అని ఎదురు చూసింది గాని ప్రసాద్ ఒక్కసారి అక్కడకు వచ్చి తీక్షణంగా లక్ష్మి వైపు చూసి చరచరా అవతలకి వెళ్లిపోయాడు.

ఆమెకేమీ అర్థం కాలేదు. భర్తతో ఏం మాట్లాడడానికి భయం వేసింది. ఇందాకటి సంఘటన నుండి ఆమెకు వళ్ళు తెలియని స్థితి వచ్చింది. అతను ఎందుకలా క్రూరంగా చూసి వెళ్లినట్లో తెలియదు, తనేం తప్పు చేసిందో అంత కన్నా బోధ పడలేదు.

తప్పు చేసి మీదు మిక్కిలి ఏమిటీ విచిత్ర ప్రవర్తన. ఇప్పుడెక్కడికి వెళ్లి వుంటారు ? అతని మాపుల్లో ఏదో కసి తీర్చుకోవాలన్న భావం, దాని వలన తనని ఏడిపించాలన్న ప్రతీకారమూ కనబడుతూ వున్నాయి. యింక అతని ప్రవర్తన మాన్పగలగడమనేది తనకు మించిన పని అనుకుంది.

పిల్లలకు చేతులు కడిగి వారిని నిద్ర పుచ్చింది. ప్రసాద్ కోసం ఎదురు చూస్తూ.... ఎంతకీ రాకపోవడం చూసి అలాగే అక్కడే ఎప్పుడో నిద్రపోయింది. విచారంతో ముఖం చిన్నబోయింది. కళ్లంట నీళ్లు కారుతూనే వున్నాయి. ఆ ఆవేదనలో లక్ష్మి ఈ లోకమే మరిచిపోయి వీధి తలుపు కూడా వేయడం మరిచిపోయింది!

అలా ఎంత రాత్రి అయిందో, గదిలో ఏదో చప్పుడయ్యేసరికి ఆమె వులిక్కి పడిలేచింది :

వంట్లో ఏకోశానా శక్తి వున్నట్టు లేదు. అలాగే లేచి ఏమిటో చూడడానికి గది వయిపు వెళ్లింది.

ఇంకేముంది ! ఆమె నరాలన్నీ తోడుకు పోయినాయి. మళ్లీ అక్కడ చిన్నమ్మి ప్రత్యక్షం ! అంటే... తన భర్త మళ్లీ దీన్ని తీసుకు వచ్చేడన్న మాట ! లక్ష్మిలో వైరాగ్యం ప్రవేశించింది. ... యీ మారు ఎదురు పడ్డానికి గాని ఎదుర్కొందికి గాని ప్రయత్నం చేయలేదు. అలా ఒక్క క్షణం నిర్జీవ ప్రతిమలాగయిపోయి తిరిగి లోపలికి వచ్చేసింది.

కాని ఆమె హృదయం జ్వలించి పోతూంది, శరీరం బగ్గున మండిపోతూంది ! అవమానం భరించలేక పోతూంది. ఇంత జరిగినా మళ్లీ ఆమెను తీసుకు రావడంలో తన భర్త ఉద్దేశ్యం ఏమిటి ? తన దగ్గర భయం లేదని, ఆమెను, తన కళ్లెదుటే యింట్లో వుంచి ఆటలాడుదామనే కదా ! ఆ విధంగా తనని యింకా ఏడిపిద్దామనే కదా ! ..... అబ్బ ! యింత కన్నా భార్యకి అవమానం వేరే వుందా ? తనకా యింట్లో యింక గౌరవం ఏది ? స్థానమేది ? ఎందుకు యింకా ఈ బ్రతుకు.

బ్రతికి ఈ అన్యాయాన్ని ఎదుర్కొనగలదు కనకనా ? తనకి ఏం శక్తి వుంది కనుక ? తనకేం స్వతంత్రం వుంది ? యింకేం చేయగలదు ? ఇంత ధైర్యంగా తన కళ్ళెదుట మరొకతెను యింట్లోకి తీసుకు వచ్చి - అయ్యో ! ఆ పవిత్రమయిన గదిలో ఆ మంచం మీదే .... ఛీ .... ఇంత కన్నా అవినీతి. యింకేముంది! యింతకన్నా వంచన యింకేముంది ? ఇంక సహించలేదు తను. కాని ఏం చేయగలదు? అలా వారిని చూస్తూ ఏమీ చేయలేక లోలోన క్రుంగి కృశించ వలసిందేనా ? యింట్లో ఓ మూల. అన్నిటినీ, దిగమింగుతూ దాసీలా పడి వుండవలసిందేనా .... లేదు..... అటు వంటి దుర్గతి కన్నా చావు మేలు. తన భర్త హృదయంలో, తన యింట్లో తన అధికారాన్ని తుడిచేస్తూ మరొకతె ఆ స్థానాన్ని ఆక్రమించేస్తూ వుంటే వూరుకొని బ్రతికేకంటే ఆత్మహత్య మేలు. ఈ చేతగాని జీవితం కంటే అదే వుత్తమం..... కాని.....కాని...

పిల్లలు, పసి పిల్లలు వాళ్ల దారి ఏమిటి ? - వాళ్లగతి ఏమిటి ? ఏమిటో అనుకోడంగాని.... ఆ భగవంతుడు లేడూ ? ఈ విధంగా మండిపోతున్న నిప్పులా కణకణ లాడుతున్న ఆలోచనలు ఆమెలో కలిగేయి. భర్త ప్రవర్తన తలుచుకొని ఆమె కోపంతో ఒళ్ళే మరచిపోతూంది... పిల్లలని తలుచుకొని మాతృప్రేమ పొంగి జాలిగా ఏడుస్తూంది. యీ విధమయిన, రెండు సమస్యల్లో ఏమీ చేయలేని స్థితిలో చైతన్య హీనురాలై పోయింది లక్ష్మి... అక్కడితో ఆమె ఆలోచనా శక్తి నశిస్తూ వచ్చింది.

ఏదో ఒక శక్తి ప్రవేశించి నట్టయింది. ఆమె ఏం చేస్తూందో ఆమెకు తెలియదు. ఆ స్థితి, పిచ్చా? కోపమా ? ఉద్రేకమో ? తన కర్తవ్యమా ? ఏమిటో తెలియని స్థితి.

ఒకసారి పిల్లలు పడుకున్న గదిలోకి పోయి వారిని ఒక్కొక్కరిని తనివి తీరా తడిమి ముద్దులాడింది!.. చంటిపాపని పొత్తిళ్లలోకి తీసుకుంది. హృదయానికి హత్తుకుంది. పాలుచేపుకి రాగా ఆఖరిసారి పాలు యిచ్చి పండుకో బెట్టింది. కంటి నీరు తుడుచుకొని గుండె రాయి చేసుకు లేచింది. నడిచింది- వంటింటి వయిపు.

కిరసనాయిలు తీసింది -

వంటినిండా వంపుకుంది -

అగ్గిపుల్ల అంటించుకుంది. .....

ఇంకేముంది ?

ఇంట్లో పొగలు క్రమ్మడానికి మంటలు పైకి రాడానికీ అట్టేసేపు పట్టలేదు... . ప్రేమ కల మంలో వున్న ప్రసాద్‌కి మంటల నీడలు గది గోడల మీద కదిలాయి. ప్రసాదూ చిన్నమ్మి, గదిలోంచి భయంతో వంటింటి వయిపు పరుగెత్తేరు.

మంటలు! మంటలు!!... వంటింట్లోంచి ఒక పెద్ద మంటల పొగ బయటకు వచ్చింది.

అది చూసి చిన్నమ్మి భయంతో పారిపోయింది.

ప్రసాద్ నిశ్చేష్టుడయి నిలుచుండిపోయాడు.

ఆ మంటల మధ్య కాలిపోతున్నది భార్యే అని తెలుసుకొనే లోపునే --

ఆ మంట సుళ్లు తిరుగుతూ వచ్చి ప్రసాద్‌ని ఆవరించుకుంది.... మరి తప్పించుకుందికి వీల్లేకుండా రెండు చేతులుతోనూ వాటేసుకుంది - ప్రసాద్ మరి విడిపించుకోలేకపోయాడు

ఆమె క్రోధాగ్నిలో మండి మసియిపోయాడు.

అదే అతనికి తగిన శిక్ష అని అనుకుందేమో లక్ష్మి!

★ ★ ★

(కృష్ణా పత్రిక, 1-12.19620)